

డీఎస్‌ఏలో ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయ



పెద్దిరెడ్డి రామలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం



కొంగోడులో నిర్వహిస్తున్న మహిళాదినోత్సవ ర్యాలీ



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీమణి హేమమణి

క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరప: స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో 5వ తరగతి (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశానికి అర్హులైన వారు ఏప్రిల్ నాలుగో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ అభ్యర్థులైతే 2012, సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 2014, ఆగస్టు 31వ తేదీ మధ్యన, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 2010 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 2014 సెప్టెంబరు 31వ తేదీ మధ్యన జన్మించి, 2021-22, 2022-23 విద్యాసంవత్సరాల్లో 3, 4 తరగతులు చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. వివరాలకు కరపలోని గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోరారు.

అయ్యప్పస్వామికి వైభవంగా పూజలు



సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బోట్‌క్లబ్: ఉత్తర నక్షత్రం సందర్భంగా స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారిని సింహవాహనంపై ఊరేగించారు. అనంతరం పుష్పాభిషేకం చేశారు. ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

కాకినాడ క్రైం: కాకినాడలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఏర్పాటు చేసిన నిఘా సత్ఫలితాలనిస్తోంది. బుధవారం నగరంలోని వెంకటేశ్వర నగర్ శివారులో మద్ది లక్ష్మి గొడౌన్ వద్ద ఆరుగురు గంజాయి కలిగి ఉన్నారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమై మెరుపుదాడి చేసి వారి నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో పాత నేరస్తులున్నట్టు త్రీ టౌన్ సీఐ కృష్ణభగవాన్ తెలిపారు. కొండపల్లి సింహాద్రి, చిమ్మా చిట్టిబాబు, ఎరోతుల మణికంఠ , ద్రాక్షారాపు ఉమాశంకర్, గెద్దం సాయి, ఏకల రఘువీర సాయి సుభాష్‌లను అరెస్టు చేసినట్టు తెలిపారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

సామర్లకోట: వివిధ రకాల వాహనాలకు విధించిన జరిమానా చలానాలను సకాలంలో చెల్లించాలని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక అవుట్ పోస్టు పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. 2018 నుంచి అనేక మంది వాహనాలకు విధించిన అపరాధ రుసుం చెల్లించక పోవడంతో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు వాటిపై దృష్టి సారించి వసూలు చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి వాహనాలను తనిఖీ చేయనున్నట్టు తెలిపారు.

టీడీపీ హయాంలోనే మహిళా సాధికారత

కరప: టీడీపీ హయాంలోనే మహిళా సాధికారత సాధించినట్టు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. గురజనాపల్లిలో బుధవారం ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ మాజీ సర్పంచ్ పంపన కన్నారావు, పార్టీనాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు.

జగన్ పాలనలో మహిళలకు పెద్దపీట

- ఎంపీ వంగా గీత
- ఘనంగా మహిళా దినోత్సవం

కాకినాడ: రాష్ట్రంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం, గౌరవం దక్కిందని ఎంపీ వంగా గీత అన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలనే లక్ష్యంతో సీఎం జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న కేక్ కట్ చేసి మహిళలకు స్వీట్లు పంచారు. ఎంపీ గీత మాట్లాడుతూ మహిళా సంక్షేమంతోనే సమాజాభివృద్ధి సాధ్యమనే లక్ష్యంతో సీఎం అన్నింటా మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రికి మహిళల ఆశీస్సులుండాలన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గర్వించే స్థాయిలో మహిళలు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. మహిళలు వైఎస్సార్ సీపీకి అన్ని విధాలా అండగా నిలవాలని ద్వారంపూడి కోరారు. అనంతరం ఆయన మహిళలందరికీ స్వీట్లు పంచారు. మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, సూపర్‌బజార్ డైరెక్టర్ వరిపల్లి కృష్ణవేణి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, గోడి సత్యవతి, తెహరాఖాతూన్, మహిళా నాయకులు కృష్ణప్రియ, మెర్ల వరలక్ష్మి, పెద్ద సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు. చిత్రంలో ఎంపీ గీత తదితరులు

స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడాలి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పండూరు పీహెచ్‌సీ డాక్టర్ ఆయేషా ఫాతిమా ఈ కార్యక్రమానికి హాజరై తరతరాల మహిళల పోరాట ఫలితమే ఈ ఉత్సవాలన్నారు. ఉపాధ్యాయిని భమిడి గిరిజా రమాదేవి, క్లబ్ అధ్యక్షురాలు టీసీ దేవకీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామ్ నగర్‌లో..

బోట్‌క్లబ్: స్థానిక శ్రీరామ్‌నగర్‌లో కాకినాడ వ్యవసాయమార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్న పెద్దిరెడ్డి రామలక్ష్మిని ఈ సందర్భంగా సత్కరించారు.

41వ డివిజన్‌లో..

స్థానిక గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో బుధవారం 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించి, పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మహిళా పారిశుధ్య సిబ్బందిని సత్కరించి స్వీట్లు, చీరలు పంపిణీ చేశారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

కాకినాడ కల్చరల్: స్థానిక సిటీ టెబెర్నికల్ చర్చి ప్రాంగణంలో వైఎంసీఏ నగరశాఖ కార్యదర్శి డాక్టర్ పి.జాన్ విజయ్‌కుమార్ గాంధీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. నన్నయ వర్సిటీ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెస్టీ మెరిలిన్ విలియమ్స్, అధ్యక్షుడు హెంద్రీ, డాక్టర్ సుగంధి, ఎస్తేర్ రాణి, డాక్టర్ ఆశ, డాక్టర్ అరుణ సౌజన్య పాల్గొన్నారు.

కొంగోడులో..

కరప: మండలం కొంగోడులో బుధవారం మండల భీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వి.నందివర్ధిని ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. గ్రామ మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు సర్పంచ్ నక్కా బాబులుతో కలసి బహుమతులు అందజేశారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధుల సేవతో సంతృప్తి

బాలాజీచెరువు: కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ యూనిట్ ఆధ్వర్యంలో మెహర్‌నగర్ మానవీయ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు, వంటపాత్రలను బుధవారం అందజేశారు. యూనియన్ వైస్ చైర్మన్ పి.అరుణ, యూనియన్ సభ్యులు యు.రాంబాబు, జి.శ్రీధర్, లక్ష్మి, సూర్య పాల్గొన్నారు.



వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న కెనరాబ్యాంక్ ఎంప్లాయిస్ వైస్ చైర్మన్ అరుణ



వేడుకల్లో పాల్గొన్న జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ సుమలత



ఉత్తమ మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో..

యూనియన్ బ్యాంక్ కాకినాడ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో పైడా చలమయ్య కళ్యాణ మండపంలో మహిళ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ డాక్టర్ సుమలత హాజరై మాట్లాడుతూ మహిళలు తమ కంటూ లక్ష్యం ఏర్పరచుకుని సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. బ్యాంక్ రీజినల్ హెడ్ చిన్నారావు, డిప్యూటీ హెడ్ డీవీ రంగారావు, మెప్మా పీడీ ప్రియంవద, మహిళా ఎస్‌ఐ లక్ష్మీకాంతం, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా అభివృద్ధి సాధించాలి

కాకినాడ సిటీ: యూటీఎఫ్ కార్యాలయంలో మహిళా ఉపాధ్యాయుల జిల్లా సదస్సు నిర్వహించారు. వీఎస్ఎం డిగ్రీ కళాశాల విశ్రాంత రీడర్ విజయ ముఖ్య అతిథిగా హాజరై ఈ దినోత్సవం ఆవిర్భావాన్ని వివరించారు. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు బి.నాగమణి, యూటీఎఫ్ నాయకులు జి.ప్రభాకరవర్మ, కేవీవీ నగేష్, షేక్ రెహమాన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసలు

కాకినాడ డిపోలో మహిళా ఉద్యోగుల అభినందన సభను బుధవారం నిర్వహించారు. డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, జిల్లా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, అంతర్జాతీయ మహిళా కమిషన్ కార్యదర్శి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ నూకల భానుమతి తదితరులు పాల్గొని మహిళా సాధికారతపై మాట్లాడారు. కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోలకు చెందిన ఉత్తమ మహిళా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు అందజేశారు. ఆయా డిపోల మేనేజర్లు, మహిళా ఉద్యోగులు, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకరరావు, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సిబ్బంది కోసం వైద్య శిబిరం

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పోలీస్ శాఖ పరిధిలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది కోసం ఆ శాఖ ఆధ్వర్యంలో ఓ కార్పొరేట్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు సతీమణి హేమమణి శిబిరాన్ని ప్రారంభించారు. మహిళా సిబ్బందికి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

డీఎస్‌ఏలో..

నాగమల్లితోట జంక్షన్: జిల్లా క్రీడా మైదానంలో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఆర్ ఆఫ్ లివింగ్ నిర్వాహకులు లక్ష్మి ర్యాలీని ప్రారంభించారు. మహిళా క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చే సందేశం అందించారు. అనంతరం మహిళా క్రీడాకారిణులకు సాంప్రదాయ క్రీడలు నిర్వహించారు. 175 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

శాస్త్రి కళా ప్రాంగణంలో..



వేడుకల్లో పాల్గొన్న ఎస్‌ఐ లక్ష్మీకాంతం తదితరులు

కాకినాడ కల్చరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దిశ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం అన్నారు. స్థానిక శాస్త్రీ కళాప్రాంగణంలో సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. సభకు దాడి పద్మచంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సాహితీవేత్త రాణీ బాలత్రిపుర సుందరి అన్నారు. వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందజేసిన 20 మంది మహిళలను వేదిక సభ్యులు సత్కరించారు. అడ్వకేట్ పి.లక్ష్మీదేవి, అద్దేపల్లి జ్యోతి, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి

- ఎంపీ వంగాగీత

కాకినాడ రూరల్: మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి సాధ్యమని నమ్మిన సీఎం జగన్ రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి పెద్దపీట వేశారని ఎంపీ వంగా గీత అన్నారు. రమణయ్యపేటలోని వైఎస్సార్ సీపీ జిల్లా క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాలలో ప్రతిభ చూపుతూ ముందుంటున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీని ఎంపీ, ఎమ్మెల్యేలు సత్కరించారు. ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ జమ్మలమడక నాగమణి, జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు సుజాత, ఇతర మహిళా ప్రతినిధులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ఎంపీ, ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వైభవంగా లక్ష్మీ జయంతి

బోట్‌క్లబ్: లక్ష్మీ జయంతి సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో బుధవారం మహాలక్ష్మి అమ్మవారికి వైభవంగా పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్ర కుంకుమార్చన, 108 కమలాలతో ఆయుష్ హోమం నిర్వహించారు. 108 మహిళలు సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐడీఏ ఆధ్వర్యంలో హోలీ



గోపూజ చేస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జంతు హింస నివారణ సంఘంలో హోలీ వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ శ్రీకృష్ణుని విగ్రహానికి, గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు రంగులు చల్లుకుని హోలీ వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు వెదురుపాక సతీష్, సభ్యులు నాగేంద్ర, చైతన్య, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

కరపలో..

కరప: మండలంలో బుధవారం కులమతాలకు అతీతంగా హోలీ పండగ జరుపుకొన్నారు. కరప, పెనుగుదురు, నడకుదురు, అరట్లకట్ట, వేములవాడ, కూరాడ, వేళంగి తదితర గ్రామాల్లో చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు.

గు'లాభ' జామ అమ్మకాలు

- స్థానికంగా పంట
- అందుబాటులో ధరలు



పిఠాపురం మండలం నవఖండ్రవాడ వద్ద అమ్మకానికి సిద్ధం చేసిన గులాబ్‌జామ కాయలు

పిఠాపురం : వేసవిలో దాహం తీర్చి శరీరానికి మంచి పోషక విలువలు ఇచ్చే గులాబ్ జామ (వాటర్ యాపిల్) పిఠాపురం నియోజకవర్గంలో జోరందుకున్నాయి. రైతులు అంతర పంటగా సాగు చేస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. మండలంలో నవఖండ్రవాడలో ఉన్న నర్సరీలో ఈ మొక్కల పెంపకం చేపట్టారు. ఇక్కడ సాగు చేసిన గులాబ్‌జామ చెట్లు విరగకాస్తుండడంతో మంచి ఆదాయం వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఒక్కో చెట్టు ఈ సీజన్‌లో అరటన్నుకు పైగా కాపు కాస్తున్నట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం కేజీ రూ.60 వరకు ధర పలుకుతోందని, రోజుకు 20 నుంచి 30 కేజీల దిగుబడి వస్తోందని చెబుతున్నారు. ఒక్కో చెట్టు రోజుకు 10 కేజీల వరకు దిగుబడి వస్తుండగా ఇక్కడ మామిడి, కొబ్బరి తోటల్లో అంతర పంటగా వేయడం వల్ల అదనపు ఆదాయం వస్తోందని రైతు అప్పారావు చెబుతున్నారు. గతంలో ఇతర ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన గులాబ్‌జామ ప్రస్తుతం స్థానికంగా లభిస్తుండడంతో పలువురు కొనుగోలు చేస్తున్నారు. నర్సరీలలో ఒక్కో మొక్క రూ.150 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు. వివిధ తోటల్లోనే కాకుండా ఇళ్ల వద్ద వీటిని పెంచుతున్నారు. ప్రస్తుతం పిఠాపురం మార్కెట్‌లోనూ ఇవి లభిస్తున్నాయి. ఉప్పాడ, పిఠాపురం రోడ్డులో తాజా గులాబ్‌జామ కాయల విక్రయాలు జోరందుకున్నాయి. గతంలో కడియం వంటి ప్రాంతాల్లోని నర్సరీలలో మాత్రమే దొరికే ఈ మొక్కలు ఇక్కడ అందుబాటులోకి రావడంతో పలువురు కొనుగోలు చేసి తోటల్లోనూ, ఇళ్ల వద్ద పెంచుతున్నారు. ఆరోగ్యకరమైన పండ్లతో పాటు ఆదాయం వస్తుండడంతో అందరు వీటిపై మొగ్గు చూపుతున్నారు. స్థానికంగా అందుబాటులో ఉండడంతో కొనుగోలుదారులకు అనువైన ధరలో దొరుకుతున్నాయి.

ఎలకొట్టుడు ఎక్కువైంది

- దిగుబడులపై రైతుల ఆందోళన
- ఎకరానికి ఆరు బస్తాల నష్టం



వాకాడలో ఎలక కొట్టుడు వల్ల దెబ్బతిన్న వరిచేను



కరపలో ఎలక కొట్టుడు వల్ల దెబ్బతిన్న పంట

కరప: రబీ సీజన్‌లో ఎలకల బెడద ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రబీ ఆలస్యమవ్వడంతో వరిచేలు ఇప్పుడిప్పుడే చిరుపొట్టదశకు చేరుకున్నాయని, ఎలుకలు వరి మూనలను నాశనం చేస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది వరినాట్లు ఆలస్యమవడంతో 90 శాతం మంది రైతులు వెదజల్లు సాగు చేపట్టారు. వెదజల్లిన పొలాలు, సాంప్రదాయ పద్ధతిలో నాటిన పొలాలు ఏపుగా పెరిగి, దుబ్బు కట్టి, బాగున్నాయనుకుంటే ఎలకల ఉధృతి చాలా ఎక్కువగా ఉందని, దీనివల్ల ఎకరానికి ఆరు బస్తాల నష్టం ఉండవచ్చని అనుకుంటున్నారు. వీటి నివారణకు రసాయనిక మందులు, ఎలుకల బుట్టలు, పొగపెట్టడం వంటి మార్గాలను అనుసరిస్తున్నారు.

ఉచితంగా బ్రోమోడయోలిన్..



రబీ సీజన్‌లో ఎలుకలు పెరిగాయి. రెండు సీజన్లుగా యంత్రాలతో కోతల వల్ల ఆహారం దాచుకోక వరిమూనలను కొరికి నాశనం చేస్తున్నాయి. వీటి నివారణకు మండలానికి 30 కిలోల బ్రోమోడయోలిన్ మందు రాగా ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేశాం. రైతులు విడివిడిగా కాకుండా సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి. 96 గ్రాములు నూకలు, 2 గ్రాములు నూనె, 2 గ్రాములు బ్రోమోడయోలిన్ మందు వంతున చేతితో తాకకుండా కలుపుకుని, పొట్లాలనుకట్టి గట్లపైన, దిబ్బలపైన పెడితే అదితిన్న ఎలుకలు చనిపోతాయి. రెండవసారి జింకు సల్ఫేడ్ (నల్లమందు) పైన చెప్పిన మోతాదులో కలిపి పెట్టుకోవాలి.

– ఏవీ రాజేష్, ఎంఏఓ

ఎలుకల బెడద ఎక్కువగా ఉంది



ఈ ఏడాది దాళ్వాపంటకు ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. వరి చేలు దుబ్బుచేసి, చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఎన్ని పద్ధతులు అనుసరించినా ఎలుక కొట్టుడు ఆగడం లేదు. ఒక్కొక్క ఎలుకను పట్టేందుకు రూ.120 లు తీసుకుంటున్నారు.

– పెంకే అప్పన్న, కౌలురైతు, కరప

వైద్య సేవల్లో సెవెన్‌స్టార్ భేష్

- కాకినాడ ఎంపీ వంగా గీత



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత. చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: అత్యాధునిక, మెరుగైన వైద్యసేవలను అందించడంలో సెవెన్‌స్టార్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కృషి అభినందనీయమని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సెవెన్ స్టార్ హాస్పటల్‌లో బుధవారం ఎముకల సాంద్రత, కాల్షియం పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఎంపీతో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులు సాంత్వన పొందేలా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారని, ఈ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరంతో ఎముకల సాంద్రత పరీక్షను ఈ నెల 20 వరకు ఉచితంగా అందిస్తున్నారని, అలాగే రూ.1500 నుంచి రూ.2000 ఖర్చు అయ్యే కాల్షియం పరీక్షను ఉచితంగా చేయించుకునే వెసులుబాటు కల్పించారని ప్రశంసించారు. సెవెన్‌స్టార్ అధినేత డాక్టర్ సత్తి వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చే మహిళలకు ఈ నెల 20వ తేదీ వరకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, శ్రావణి హాస్పటల్ అధినేత డాక్టర్ సత్తి వీర్రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

రేపు ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక విద్యుత్‌నగర్ చల్లా కల్యాణమండపంలో శుక్రవారం ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తి సమితి అధ్యక్షుడు జి.అన్నపూర్ణయ్య శర్మ తెలిపారు. ఆయన స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి కృష్ణా జిల్లా గన్నవరం భువనేశ్వరి పీఠం స్వామిజీ కమలానంద భారతి తదితరులు పాల్గొంటారన్నారు.